


ఉష తారయింది. ఉష సినీమాల్లో చేరింది.

ఈ విషయం ఉషబంధు కోటిలో చాలా కలవరపాటు కల్గించింది. ఇంచుమించు వాళ్లలో విప్లవం బయల్దేరిందనొచ్చు-అసలంతా నాలిక పీక్కునే దేనికంటే మొగుడుకూడా దాన్తో 'సై' అని తానే చేర్పించాడు. ఈ ముక్క ఉషబంధు కోటికి స్టెన్‌గన్ షాట్‌లా తగిలింది. "కాలం మారిపోయిందమ్మా" అన్నారు చాలా మంది, ఉష సినీమాల్లో చేరగానే మారినట్టూ, అంతకుముందు నిటార్గా నిలబడి చలనం లేనట్టున్నూ. ప్రాపగండాదారులు దారులు వెతుక్కున్నారు. ముఖ్యంగా వాళ్ళలో కృష్ణమూర్తి ఒకడు అతనైనా పరాయివాడా? ఉషకి స్వయానా-సాక్షాత్తూ మేనమామ, అతనే నాతో ఆ విషయం చెప్పాడు. ఆ చెప్పడం కూడా బహుచమత్కారంగానూ, అతి వ్యంగ్యంగానూ, ఘట్టిగా దులిపేస్తూనూ, ఇహ ముందు తనెప్పుడూ వాళ్ళగుమ్మం తొక్కితే ఒట్టన్నట్టున్నూ, తనే గాకుండా వాళ్ళ బంధువులెవ్వరూకూడా వాళ్ళ ఫామిలీని ఎడంకంటితో కూడా చూడకూడదని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నట్టున్నూ చెప్పాడు. ఈ మాటలు విని నేను చాలా ఆశ్చర్యపోయేను. "కృష్ణమూర్తి ఇంతలో ఎలా మారిపోయాడు చెప్మా!" అనుకున్నాను. ఒహమాటు తనే నాతో అన్నాడు-ఉష అంగసౌష్ఠవం స్క్రీన్‌కి బావుంటుందనీ, ఉష తారయితే బాగా రాణించగలదనీ, ఆమె ఉజ్జ్వల భవిష్యత్తున్నదనీని. మళ్లీ యివ్వాళ యిలా మాట్టాడేడు. ఉష మొగుడు వట్టి చేతకానివాడనిన్నీ, తను సంపాదించలేక పెళ్లాం సంపాదిస్తే దాని సంపాదనతో మేడకట్టేసి తను పక్షీంద్రుడిలా తయారు కావడానికి ఉబలాటపడుతున్నాడనిన్నీ చెప్పాడు. ఇంతేకాదు-తన అక్కను వెళ్ళబోసుకునేందుకు భాషలో వున్న ఘాటైన పదజాలం అంతా దులిపేశాడు. అన్నీ ఓపిగ్గా విన్నా. నాకు వళ్లు మండింది. "దాని

"బదరీనాథ్"

మొగుడు తనంతట తనిష్టపడి తానుగా ఆ అమ్మాయిని సినిమాల్లో చేర్పిస్తే మధ్య నీకూ నాకూ యెందుకయ్యా దురద" అని నాలుగూ అతని మొహామ్మీదనే దులిపేశాను. తిరిగి అతను నాతో మాట్లాడకుండా వెళ్లిపోయేడు. రెండో ప్రచారకుడు రాఘవరావు. హఠాత్తుగా ఓ కాఫీహోటల్లో కనిపించాడు. కాఫీ తాగుతూ అన్నాడు: 'విన్నావోయ్' అని. 'ఏంటూనోయ్' అన్నా. అతను చెప్పబోయేది మనసులో నే ఊహించుకుంటూ.

'ఏమిటి?' అన్నాడు.

'నువ్వు చెప్పబోయేది' అన్నా.

'మాటలు నేర్చావుగాని, నీతో ఓ సంగతి చెపుతాను. ఎవరి దగ్గరా మళ్ళీ నోరు జారకు' అని ఓ గుక్కెడు కాఫీ తాగి మళ్ళీ మొదలెట్టాడు.

''ఎరుగుదువ్ కదూ! మా బాబయ్య కూతురు ఉషని దాని సంగతి నువ్వింకా వినలేదా యేమిటి? అయ్యయ్యో! అయితే వినాల్సిందే. మా బాబయ్య ప్రస్తుతం పాతిక వేల రూపాయలు అప్పు చేసి పెట్టాడు. దాన్ని తీర్చే సాధుడెవ్వడూ లేడు. బి. ఏ. ప్యాసయినా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోడానికేగాని ఆ చంద్రిగాడు మరెందుకూ పనికిరాడు. సరే- ఆయన తనాశలన్నీ కూతురుమీదే పెట్టుకున్నాడు. నీకూ తెలుసుగా ఆయన లండను యెల్లా వెళ్ళొచ్చాడో, పెళ్ళాన్నుపయోగించుకుని. ఇప్పుడూ అప్పు తీర్చి ఆస్థి చెయ్యటానికే కూతుర్ని సినిమాలో చేర్పించాడు. ఈ యేడి నేది పెళ్లి కాకముందు యేడిస్తే బాగుండేది.' అన్నాడు రఘువరావు. ఒక విషయాన్ని గూర్చి ప్రాపగాండా చెయ్యడంలోనే రెండు రకాలు. నేనన్నా,

'అదేమిటోయ్. ఆయన చేర్పించడవేమిటి? శ్రీధర్రావ్ తనిష్టంమీదే చేర్పించాట్టగా ఆణ్ణి.'

'చాల్చాల్లే. ఎవరన్నారా ముక్క! పాపం అతన్ని వెర్రిబాగులాణ్ణిచేసి కూర్చోబెట్టి అతని చేత నిక్షేపంలాంటి ఆస్థిని తగలబెట్టించి అయిన కాడికదంతా కాజేసి వాడిచేత యింట్లో నానా చాకిరీ చేయించుకొంటో, పైగా యీ ముక్క గూడానా? నిన్నగాక మొన్న నాదగ్గరకొచ్చి మొత్తుకున్నాడు వెర్రిముండావాడు. అయినా మంచిపని జరిగిందిలే. లేకపోతే తనత్తారింట్లో వుండడవేమిటి ఖర్మంకాలి. హాయిగా రెండతస్థుల మేడా, ముప్ఫయ్యేకరాల పొలమూ నిక్షేపంలాంటి ఆస్థి పెట్టుకుని యీ అత్తారింట్లో పడిఏడవడవేమిటి? అందుకే తగిన శాస్తి జరిగింది. పెళ్ళయి యింది ఎనిమిదో నెల. అప్పుడే అంతా మెడ్రాసులో మకాం పెట్టేశారు. వాడాస్థి అమ్మగా తమ సంపాదన పేరుతో అదంతా పెట్టుకు తింటూ పెళ్లాన్ని కూతుర్నీ ప్రతి డైరక్టరు దగ్గిరికీ పంపిస్తూ ఎట్టకేలకు కూతుర్ని 'స్టార్' చేశాడు స్టార్. బాగుందా?' అన్నాడు.

'భేషుగ్గావుంద'న్నాను. అంతకంటే అతనెదురుగా యేమనాలో తోచింది గాదు నాకు. అయితే మనసులో మాత్రం నవ్వుకున్నాను. ఆ తర్వాత ఓ మాటు నేను కాకినాడ వెళ్ళడం తటస్థించింది. అక్కడ ప్రాపగాండా యీ రెండింటినీ మించుంది. చంద్రంబావ మరిది కనుపించాడక్కడ ఓ సినిమా హాల్దగ్గిర.

'సినిమాకొస్తావుటోయ్' అనడిగా.

'మద్రాంలెండి తొందరేంవుంది. రెండు మూడు నెలల్లో మనవాళ్ళనే చూడొచ్చులెండి తెరమీద.' అన్నాడు విషంగా నవ్వుతూ.

'అదేమిటోయ్?' అని ప్రశ్నించాను యేమీ తెలియని వాడిలా.

'ఇంకా తెలీదేంటి? బాగానే వుంది. అయితే విను. మా చెల్లెలి ఆడబడుచు మొగుడువుగదూ ఉషమ్మగార్ని. అణ్ణే చూడబోతాం తెర మీద.'

'నిజంగా?' అన్నా వట్టి అమాయకుడిలా.

"అయితే అబద్ధ మాడే నంటావా? ఎల్లా చేరిందో గూడా చెప్తాను" అన్నాడు కనడక్కుండానే.

"అయ్యన్లేదూ. మా చెల్లెలి మావగారు. ఎవత్తో లంబాడీ దాన్ని పెళ్లి చేసుకుని పెళ్ళాన్ని ఒదిలిపెట్టేశాడు. ఆవిడంతకంటే అసాధ్యురాలు, ఆడది గాబట్టి ఎలాగైనా నెగ్గుకొస్తాంగదా అనే ధైర్యంతో మద్రాస్ వెళ్లి డైరక్టరుని మంచి చేసుకుని తప్పునకూతుర్ని ఓ అభ్యుదయ


ఆంధ్రదేశ మంతటను
త్వరలో విడుదల
పక్షిరాజా వారి
బీదల
పాట్లు
నాగయ్య
లలిత..పద్మిని నటించినది
డైరెక్షన్
రామనాథ్
చప్రియా
రిలీజ్..



"స్వప్నసుందరి"లో అభినేత్రి అంజలీదేవి

తారగా చేసి కూర్చో పెట్టింది. ఇప్పుడు తెలిసిందా!' అన్నాడు. నా గుండె ఆగిపోయినంత పనయింది. ఒక్కసారిగా త్రిమూర్తులూ ప్రత్యక్షమయితే ఏంచెయ్యాలో తెలియని భక్తుడు కటకటలాడినట్లు యీ మూడు ప్రభావాల్లో యేది నమ్మాలో తెలియక టకటక లాడిపోయేను. మళ్లీ అడిగానతన్ని. 'మీ చెల్లెలి మావగారు కూడా వాళ్లతో బాటే వుంటున్నారటగా.' అని. 'అప్పుడు బాగా డబ్బొస్తుంది గాబట్టి అదంతా తన పేరనే బ్యాంకులో వేసుకుందాం అనే వుద్దేశ్యంతో తయారయ్యేడు'. "ఓహో!" అన్నాను.

తర్వాత ఉష యాక్టు చేసిన పిక్చర్ రిలీజ్ అయింది. ప్రతీ పత్రికా ఉష ఫొటో త్రివర్ణ ముఖచిత్రాంగా ప్రకటించింది. ఉష బొమ్మలున్న వాల్‌పోస్టర్లు కొన్ని వాళ్ళ బంధువుల గోడలకే అంటించబడ్డాయి కూడాను. అందరూ ఆ సినిమా చూసేరు. ఉష బంధువులతో సహా. రాఘవరావు, కృష్ణమూర్తి, చంద్రం బావమరిది రిజర్వుడు టిక్కట్టు కొనుక్కొని మరీ చూసి వుంటారు. ఇంటి కొచ్చాక సరసమ్మ కొడుకు నడిగింది. 'ఏమి రాఘువులూ! ఉష అంత మరీ సిగ్గులేకుండా వాడితో యెలా కలిసి పాడిందిరా! హవ్వ! కాలం మారిపోయిందిరా' అని మరోసారి ఆవిడ కేక సంఘం అనిపించింది. వీళ్ళందర్నీ చూసేక యేం చెయ్యాలో తెలిసింది కాదు నాకు. హాల్లో కూర్చున్నప్పుడు ఆట వస్తూండగా నా పక్కని కూర్చున్నాయన తన స్నేహితుడితో అంటున్నాడు. 'ఆ వేషం వేసిన ఉష నాకు స్వయానా పినతండ్రికూతురండీ' అని గొప్పగా. లైట్లు వెలిగాక రాఘవరావు నాకేసి చూసి 'మీ రిక్కడే వున్నారేమిటండీ!' అన్నాడు మొహం యింత చేసుకుని. ఉష యాక్టుచేసిన పిక్చర్ నేనూ చూశాను. నిస్సందేహంగా ఆ అమ్మాయి చాలా బాగా నటించింది. ఉషకి ఉజ్జ్వలభవిష్యత్తుందని అప్పుడే అనుకున్నాను. ఉషకి నా అభినందనాలు చెప్పటానికి మద్రాసు వెళ్ళినప్పుడు వాళ్లింటికి వెళ్లాను. చిఱునవ్వుతో నన్ను లోపలి కాహ్వానించింది. కాఫీ కప్పు ముందుంచుతూ తనూ ఓకుర్చీ వేసుక్కూర్చుంది. మునుపటికంటె చాలా నిరాడంబరంగా వుంది. సంభాషణే యెలా మొదలెట్టాలో తెలిసిందిగాదు నాకు. తనే అంది. 'మా రాఘవన్నయ్య, క్రిష్ణమూర్తి మావయ్య, మా వదిన, అన్నా నా నటనని ప్రశంసిస్తూ అభినందనాల్తో ఉత్తరాలు వ్రాశారు.' అని అవన్నీ తెచ్చి నా ముందు పారేసింది. అన్నీ చదివాను. వాళ్లు మున్నుగా నా ముందు ఉషని యెంత తిట్టారో ఆ ఉత్తరాల్లో అంత యెక్కువగా పొగిడారు. వెంటనే అనుకున్నాను. వాళ్ళంతా వత్తి పరికెపందలనీ, పయోముఖ విషకుంభాలనీని. ఎంచేతనంటే— మనస్సులోవున్న చెప్పదల్చుకున్న మాట ముందు బ్రద్దలుకొట్టినట్లు మొహంమీద చెప్పకపోవడం వల్లనే.